క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్‌లో డబుల్‌బెడ్‌రూం కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెండెం రాములు, బల్మూరి మల్లేశం గౌడ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

మల్యాల: చొప్పదండి మండలంలోని ఆర్నకొండ నుంచి మల్యాల వరకు డబుల్ రోడ్డు విస్తరణకు నిధుల మంజూరు కాగా, బుధవారం కాంగ్రెస్ నాయకులు స్థానిక బ్లాక్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్; దారం ఆదిరెడ్డి, శనిగరపు తిరుపతి, మ్యాక లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోదావరి వైపు ఎవరూ వెళ్లొద్దు


గోదావరి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: గోదావరి వైపు ఎవరిని వెళ్లనియ్యవద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. బుధవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 37 గేట్ల ద్వారా నీటిని గోదావరిలోకి వదలడంతో గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. గోదావరి వైపు గొర్రెలు, పశువుల కాపరులను పుణ్యస్నానాలకు వెళ్లకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎగువ కురుస్తున్న వర్షాలతో శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఎప్పుడైన గోదావరిలోకి నీటిని ఎక్కువగా విడుదల చేసే అవకాశాలు ఉన్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, పంచాయతీ కార్యదర్శి మనోజ్, నాయకులు నడ్పి రాజన్న పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు అందించాలి


కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న వసంత

రాయికల్: గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెలనెలా జీతాలు ప్రభుత్వం చెల్లించాలని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. మండలంలో అయోధ్య గ్రామంలో బుధవారం పారిశుధ్య కార్మికులను కలిసి మాట్లాడారు. జీతాలు రాక వారు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి ఉన్న జీతాలను విడుదల చేయాలని, కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ ముత్త గౌడ్, నాయకులు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

దుంపేట ఊరచెరువుకు గండి


గండి పడి వృథాగా పోతున్న నీరు

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామ శివారులోని ఊరచెరువుకు బుధవారం సాయంత్రం గండి పడటంతో నీరు అంత వృథాగా పోతోంది. ఈ నీరు ఉధృతంగా పారడంతో దూలురు, కథలాపూర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఒర్రె వద్దకు రెవెన్యూ, పోలీసులు చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. నీటి ఉధృతి తగ్గే వరకు ఒర్రెను దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జగిత్యాల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని రామచంద్ర మిషన్ ధ్యాన శిక్షకులు మంచాల కృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంలో ఉచిత యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన భారతీయ ఋషుల నుంచి వరంగా వచ్చిన ఈ క్రియను అభ్యసించడం ఎంతో ఆనందకరమని, ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన వేడుకలు

జగిత్యాలరూరల్/జగిత్యాలఅగ్రికల్చర్/జగిత్యాల టౌన్/ధర్మపురి/రాయికల్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/గొల్లపల్లి/బుగ్గారం/మల్లాపూర్/మల్యాల/సారంగాపూర్: ప్రజా పాలన దినోత్సవంను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి బోనగిరి నరేశ్, అర్బన్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ జెండా ఎగురవేశారు. పట్టణాలు, మున్సిపల్ కార్యాలయాలు, మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పార్టీ కార్యాలయాల్లో పార్టీల నాయకులు జాతీయజెండా ఆవిష్కరించారు.పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస వ్యవసాయ కళాశాలలో డైరెక్టర్లు జెండావిష్కరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.


జగిత్యాల రూరల్ కార్యాలయంలో జెండావిష్కరణ


రాయికల్‌లో జెడ్పీ సీఈవో ..


ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన వేడుకల్లో డీఎం, సిబ్బంది


పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో జెండావిష్కరణ


ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో..


పెగడపల్లి మార్కెట్ కార్యాలయంలో జెండావిష్కరణ

తెలంగాణ విమోచన దినోత్సవం


పటేల్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


రాయికల్: జెండావిష్కరించిన బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు యాద గిరిబాబు జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి కొత్త బస్టాండ్ చౌరస్తాలోని మాజీ కేంద్ర హోంమంత్రి, దివంగత సర్దార్ వల్లభాయ్ విగ్రహానికి బీజేపీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్: పట్టణంతో పాటు మండలంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, వివిద పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణా, తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమిషనర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బీజేపీ శ్రేణులు బుధవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఘనంగా నిర్వహించాయి. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా పలు కార్యాక్రమాలను నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు.

రాయికల్: మండలంలోని రామాజీపేటలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


కోరుట్లలో అన్నదానం చేస్తున్న నాయకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్/మల్లాపూర్/ధర్మపురి/రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని పైడిమడుగులో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వర ఆలయం, అయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. పైడిమడుగులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మల్లాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, యువకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణి చేశారు.

ధర్మపురి పట్టణంలో బుధవారం నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాంసుధాకర్ ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం చేశారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

గొల్లపలి/కొడిమ్యాల/మల్యాల/వెల్గటూర్: నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బీజేపీ నాయకులు పలు చోట్లల్లో కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ చేశారు.వెలగటూర్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి పేదలకు, వృద్దులకు పండ్లు పంపిణీ చేశారు ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మల్యాలలో బీజేపీ కొడిమ్యాల మండల నాయకులు తిర్మలాపూర్ ఎంపీటీసీ పరిధిలో గల కేజీబీవీ పాఠశాల శాలలో విద్యార్థులతో కలిసి మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.. మెట్‌పల్లి పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ ఆధ్వర్యంలో స్థానిక బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామంలో వరి పొలాలను పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు బి.శ్రీనివాస్, స్పందన భట్, స్వాతిలు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : నాణ్యమైన విత్తనంతో వ్యవసాయం లాభాలు గడించవచ్చని, నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తమని పొలాస ప్రాంతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ స్పందన, వై.స్వాతి అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని సాతారంలో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో విత్తనోత్పత్తి కోసం సాగు చేస్తున్న వరి పంటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వంశీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వరిలో బెరుకులు తొలగించాలి

కోరుట్ల రూరల్: రైతులు వరి పొలాల్లో ఉన్న బెరుకులను కలుపు ద్వారా తొలగించాలని పొలాస ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు అన్నారు. నాణ్యమైన విత్తనం-రైతుకు నేస్తం కార్యక్రమంలో భాగంగా బుదవారం కోరుట్ల, సంగెం గ్రామాల్లో వరిపొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

మెట్‌పల్లి: పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీచర్స్ ట్రెనింగ్ వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణను ఇచ్చి అవగాహన కల్పించారు. అనంతరం ఎంఈవోలు చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి గవర్నర్ కోదండరాం చేతుల మీదుగా వారికి సర్టిఫికెట్లు బోధన కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు వెల్ముల శ్రీనివాస్‌రావు, చంద్రప్రకాశ్, ఇనుగుర్తి రమేశ్, పోతాని ప్రవీణ్, కొండపల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

మల్లాపూర్: పదోన్నతులు, వర్క్ అడ్జస్ట్‌మెంట్‌తో పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీలను వెంటనే సర్దుబాటు చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బబ్బూరి రాజేందర్ అన్నారు. మల్లాపూర్ ఎంఆర్సీ కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌తో కలిసి ఎంఈవో దామెదర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు అభినందన

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన మండలస్థాయి క్రీడలలో అత్యంత ప్రతిభ కనబర్చడంతో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం లక్ష్మీబాయి, ఇన్‌చార్జి హెచ్ఎం ప్రశాంతి, పీడీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మల్లాపూర్‌లో బతుకమ్మ పాట షూటింగ్

మల్లాపూర్: ఫోక్ సింగర్ శిరీష పాడి నటించిన బతుకమ్మ పాటను బుధవారం మండల కేంద్రంతో పాటు వేంపల్లి గ్రామంలో చిత్రీకరించారు. మల్లాపూర్, వేంపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యుదయ రైతు రాంరెడ్డికి సన్మానం

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు, అభ్యుదయ రైతు వెల్ముల రాంరెడ్డిని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి సన్మానించారు. హైదరాబాద్‌లోని బూర్గుల రామక్రిష్టారావు భవన్‌లో ×వ్యవసాయంలో రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువుల వాడకం¥ అనే అంశంపై జరిగిన సదస్సుకు అభ్యుదయ రైతులను ఆహ్వానించారు. ఈ సమావేశానికి కొడిమ్యాల మండలం పూడూరుకు చెందిన రాంరెడ్డి హాజరయ్యారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి సాగులో రసాయన ఎరువుల వాడకంపై మారుతున్న రైతుల ధోరణి, సేంద్రియ వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనికి ఆయనను సన్మానించారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్‌కు వినతి

రాయికల్: పట్టణంలో బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండగలు నిర్వహించే ప్రదేశాల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కన్నక మహేందర్, మారంపల్లి సాయికుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీ యూటీఎస్ మండల శాఖ ఎన్నిక

కథలాపూర్: ఎస్టీయూ టీఎస్ మండల కార్యవర్గం ఎన్నికలు బుధవారం జరిగాయి. అధ్యక్షుడిగా నల్ల సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా నల్ల రాజ్ కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, ప్రవీణ్, రాజేశ్, సహాయ కార్యదర్శులుగా విద్యసాగర్, చిరంజీవి, ప్రేమలత, చెన్న జయశ్రీ, పుష్పాల రాజకళ, ఫైనాన్స్ సెక్రటరీగా ఉషకోల విశ్వనాథం, జోగే అశోక్, పెద్దింటి సంతోష్‌లు ఎన్నికయ్యారు.

మాజీమంత్రిని కలిసిన ఇటిక్యాల నూతన గ్రామ సేవ సమితి సభ్యులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో నూతనంగా ఏర్పడ్డ గ్రామ సేవా కమిటీ సభ్యులు బుధవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడులింబాద్రి, ఉపాధ్యక్షుడు ఓరుగంటి శేఖర్, కోశాధికారి కొక్కు శ్రీను, కమిటీ సభ్యులను జీవన్‌రెడ్డి అభినందించారు.

కుటుంబ అభియాన్ విజయవంతం చేయాలి

రాయికల్: సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే కుటుంబ అభియాన్‌ను విజయవంతం చేయాలని రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ అభియాన్ కార్యక్రమంపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్, డాక్టర్ నరేందర్, డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

మల్యాలలో అలుగుదూకుతున్న చెరువులు



మల్యాల: మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో చెరువుల్లో నీరు చేరి, జలకళ సంతరించుకుంది. మల్యాలలో బుధవారం కురిసిన వర్షానికి మల్యాల మత్తడి చెరువు, సూరప్ప చెరువులు అలుగుపారుతుండడంతో స్థానికులు చెరువులను సందర్శించి, సందడి చేస్తున్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు




రాయికల్,ఇబ్రహీంపట్నంలో పూజలు చేస్తున్న విశ్వకర్మ నాయకులు

రాయికల్: పట్టణంలోని వెంకటేశ్వర మన్మయ సేవ సంఘం, స్వర్ణకార సేవ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్వకర్మ పూజ, హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గాజోజు మురళీ, ప్రధాన కార్యదర్శి ఎనుగుర్తి శంకర్, స్వర్ణకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో బుధవారం విశ్వకర్మ జయంతిని విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ పూజను నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మణులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమాల్లో విశ్వ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: విశ్వ సృష్టికర్త విశ్వకర్మ భగవానుడు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు అన్నారు. బుధవారం గొల్లపల్లి మండల కేంద్రంలో విశ్వకర్మ భగవానుని జయంతి సందర్భంగా మండలంలోని విశ్వకర్మలను సన్మానించారు.

ధర్మపురి: పట్టణంలోని విశ్వకర్మ భగవాన్ దేవాలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిసాయి. వేడుకల సందర్భంగా రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు.

డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం

కోరుట్ల: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం జిల్లా అటవీ శాఖ, జిల్లా యువజన, విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల అవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌వో సురేష్ రావు, ప్రిన్సిపాల్ సాందీప్, అరుణ్ కుమార్, చైతన్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజ్ కుమార్,అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి

పెగడపల్లి: మండలంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి కోరారు. మండలంలోని రామభద్రునిపల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం హయాంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరించి ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందేలా కృషి చేయాలన్నారు. నాయకులు రాజేశ్వర్‌రావు, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మన్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గోసేవ ప్రముఖ్ శ్రీగద్దె సుమన్, ఎలగందుల రమేశ్, హెచ్ఎం రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాత్రదానం పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల: యాత్రదానం చేయండి.. ఆనందాన్ని పంచండి అనే కొత్తదానికి ఆర్టీసీ వారు శ్రీకారం చుట్టారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, స్టేషన్ మేనేజర్ రవీందర్ రావు, ఎస్‌జె.రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల పోషకాహారంపై అవగాహన

రాయికల్: పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో రోజు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సుల్తానా, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీల టీచర్లు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ రైతు వేదికలో కోరుట్ల, మల్లాపూర్ మండలాల అంగన్వాడీ టీచర్లకు పోషణ్ బీ. పడాయి బీ శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్రవంతి, శంకరమ్మ, డీఈఓ మహేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పోషకాహారం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ కార్యకలాపాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని జగిత్యాల జిల్లా ఐసీడీఎస్ పీడీ నరేశ్ అన్నారు. పట్టణంలోని సినారే కళా భవన్ బుధవారం అంగన్వాడీల పోషన్ బి, పడాయి బీ. మూడు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యాక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో మణెమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

వెల్గటూర్: మహిళలు ఆరోగ్యం దృష్టి సారించాలని ఎండపల్లి మండలం అంబరిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లవకుమార్ అన్నారు. బుధవారం ఎండపల్లి మండలంలోని అంబర్‌పేట పీహెచ్‌సీ పరిధిలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ గోపిక చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ క్యాంపులో 14డ రకాల హెల్త్ ఇండికేటర్ల మీద స్క్రీనింగ్ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డా.శ్రవణ్, డా.షమీనా, డా.అంజన, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సత్కారం

జగిత్యాల: ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పర్లపల్లి రాజు ఇటీవల ఉత్తమ అధ్యాపకునిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలువగా ఎమ్మెల్యే ఆయనను ఘనంగా సత్కరించారు.

టాయిలెట్స్ నిర్మాణానికి భూమిపూజ

వెల్గటూర్: మండలంలోని కుమ్మరిపల్లి లోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి ఏఎంసీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కథలాపూర్: మండలంలోని తాండ్రియాల గ్రామ శివారులో వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న చారీ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

సమాచారం..

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మల్లాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ పనులపై మండల స్థాయి 15వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామసభలో చర్చించిన అంశాలపై మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నియామకం

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

జగిత్యాలరూరల్: లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని బుధవారం జిల్లాకేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనగంటి సామ్రాట్ (జగిత్యాల), ఉపాధ్యక్షులుగా మహ్మద్ అన్వర్ (కోరుట్ల), ఎంఏ.ముఖ్రం (జగిత్యాల), ప్రధాన కార్య దర్శిగా బొమ్మెల శంకర్ (మెట్‌పల్లి), సహాయ కార్యదర్శిగా అంజిద్‌ఖాన్ (జగిత్యాల), కోశాధికారిగా రాచకొండ శ్రీనివాస్ (కోరుట్ల), కార్యవర్గ సభ్యులుగా ఎంఏ.ఫారూఖ్, షేక్ వాజిద్, కొండ శ్రీనివాస్, ఎండీ.ఫిర్దోస్, రఫీక్, మోహన్ ఎన్నికయ్యారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా నదీం హుస్సేన్

పెగడపల్లి: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఎండీ నదీం హుస్సేన్ ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు బుధవారం మండల కేంద్రంలో జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా కె.ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా అనిత, శ్రీనివాస్, డి.ప్రవీణ్, పద్మ, లావణ్య, సలహాదారుడిగా శ్రీనివాస్, ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా మహేశ్, కోశాధికారిగా హేమంత్, కల్చరల్ కార్యదర్శిగా శివప్రసాద్, సంయుక్త కోశాధికారిగా తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా నిఖిల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా మధు, రజిని,మీడియా కార్యదర్శిగా నవీన్, అడ్మిన్‌గా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్లుగా మంజుల, శంకర్, కిరణ్‌బాబు, నరేందర్ నియామకమ్యారు,

తక్కళ్లపల్లి లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా జ్యోతి

జగిత్యాల: జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి పశువైద్యశాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా జ్యోతి బదిలీపై వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించగా పశువైద్య బృందం ఆమెను సత్కరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా : 9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
జగిత్యాల : సంపత్ - 9676406002
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899